జూన్, 17, ప్రపంచకరువు - ఎడారీకరణ దినం సందర్భంగా

# అనంతపురం జిల్లాలో కరువు - ఎడారీకరణ నివారించి, వ్యవసాయ సంక్షోభాన్ని రైతుల దుస్థితిని తొలగించడానికి దశ సూత్ర కార్యక్రమం

డా॥ వై . వి. మల్లా రెడ్డి
డైరెక్టరు, ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటరు,
అనంతపురం.
17.06.2013

## 1. పరిచయం:

*ఈ దశసూత్ర పథకం వ్యవసాయానికి నీటి రక్షణ కల్పించడం ద్వారా, ప్రకృతి అనుకూల సుస్థిర వ్యవసాయ పద్ధతుల ద్వారా కరువులను అధిగమించి, వ్యవసాయ సంక్షోభ నివారణకు రైతుల దుస్థితిని తొలగించడానికి ఉద్దేశించబడినది. ముఖ్యంగా దీని ద్వారా వర్షాధార రైతులకు నికరాదాయం, పౌష్టికాహార భద్రత కోసం కూడా సమకూర్చుతుంది. అంతేకాకుండా ఈ కార్యక్రమం ద్వారా వృక్ష సంపద వర్షపునీటిని నిలువరించి, భూగర్భజలాలు పెంచి ఎడారీకరణను నివారించవచ్చును.*

అనంతపురం జిల్లా నిత్య కరువులకు ఎడారీకరణకు నిలయంగా మారిపోయింది. గతంలో ప్రతి రెండు, మూడు కరువు సంవత్సరాల తర్వాత ఒక మంచి పంట పండే సంప్రదాయం అనాదిగా ఈ జిల్లా అనుభవంలో ఉండేది. కానీ ప్రస్తుత పరిస్థితులలో పది సంవత్సరాలకు ఒకటి రెండు పంటలు కూడా రావడంలేదు. తీవ్ర నీటికొరత కారణంగా ప్రాణికోటి, ముఖ్యంగా పచ్చదనం, పశువులు, పక్షులు నశించి, వేగంగా ఎడారిగా మారుచున్నది. ఈ జిల్లాలో కురిసేది తక్కువ వర్షాపాతము కూడా రుతువులు గతి తప్పి భిన్నంగా వర్షాలు కురవడం, పంట అవసరాలకు ప్రతికూలంగా కురవడం, విపరీతంగా మారిన ఋతు ధర్మాల ప్రభావం మనుష్యుల ఆరోగ్యాల మీదనే కాక, పంటల పెరుగుదల, దిగుబడుల మీద వ్యతిరేక ప్రభావాన్ని చూపిస్తున్నాయి.

జిల్లా రైతులు సంక్షోభంలో కూరుకుపోయి వున్నారు. వర్షాధార రైతులు వ్యవసాయం ద్వారా తమ జీవనం కొనసాగలదనే ఆశను వదిలిపెట్టారు. నిరాశ నిస్పృహలతో ఈ రైతులు భవన నిర్మాణం, ఇతర అసంఘటిత రంగాలలో కూలీలుగా పట్టణాలకు వలసపోతున్నారు. వర్షాధార వ్యవసాయం నుంచే నిష్క్రమణలు అధికంగా వున్నాయి. ఇదే విధంగా కొనసాగితే, రాబోయే అయిదు సంవత్సరాలలో 50 శాతం జిల్లా రైతులు వ్యవసాయన్ని మానివేసి నగర మురికి వాడల్లో చెప్పలేని దుర్భర జీవనాన్ని అనుభవించబోతారు. ఇదొక రైతుల అతి పెద్దవలసఉప్పెనగానూ, రైతు స్థాయినుండి దిన కూలీలుగా మార్పు చెందే అతి పెద్ద సామాజిక తిరోగమన పరిణామంగానూ వుండబోతుంది.

### 1.1 ప్రధానంగా అనంతపురం జిల్లా వ్యవసాయ వాతావరణ పరిస్థులు

1) తక్కువ సగటు వర్షాపాతం (521 మి. మీ) జిల్లా అంతటా ఒకే విధంగా ఉండదు. ఆవిరి ద్వారా నష్టపోయేది 1850 మి. మీ. చలికాలంలో 12-15 సెంటిగ్రేడ్ కనీసంగానూ 25-33$^0$ అధికంగానూ వుండగా, ఎండాకాలంలో 40-43 సెంటిగ్రేడ్ అధికంగానూ, 26-31 కనీసంగానూ వుంటోంది.
2) 11 లక్షల హెక్టార్ల సాగు భూమిలో 85 శాతం ఎర్ర గరుప నేలలు, 15 శాతం నల్లరేగడి భూములు.
3) దాదాపు 10 లక్షల హెక్టార్లు (90%) సాగు భూమి వర్షాధారం కాగా కేవలం 10 శాతం భూమికి మాత్రమే నీటి పారుదల సౌకర్యం వుంది. అది కూడా చాలా వరకూ బోర్ల మీదే ఆధార పడింది.
4) 7 లక్షల రైతు కుటుంబాలలో 90 మంది శాతం సన్న-చిన్నకారు రైతులే - ముఖ్యంగా దళిత ఒడుగు బలహీన వర్గాలు
5) చిన్న కమతాలు, కండిలేని ఎర్రగరప నేలలు- అధికవాలు, ఎగుడుదిగుడుగా వున్నవి.
6) పచ్చదనంలేని 2 లక్షల హెక్టార్ల అటవీ భూములు వున్నవి.
7) 2 లక్షల హెక్టార్ల రెవిన్యూ భూములలో బోడికొండలు, వంక పోరంబోకులు, చెరువు గర్భాలు తదితరాలలో పచ్చదనం, చెట్లు చేమలు లేకుండా వున్నాయి.
8) మొత్తంగా పర్యావరణం క్షీణించి, నీటికొరత పెరిగి, కరువులు అధికమై, జీవరాశులు జీవించడానికి వీలు లేని ఎడారిగా జిల్లా వేగంగా మారిపోతున్నది.

1.2. పైన వివరించిన పరిస్థుతులలో జిల్లాలో కరువులనధిగమించి, తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం, రైతుల దుర్భర పరిస్థుతులు నివారించడానికి మరియు ఎడారీకరణను నివారించడానికి, దశ సూత్ర కార్యక్రమాల్ని ప్రతిపాదిస్తున్నాము; ఈ దశ సూత్ర పథకాన్ని గనుక యుద్ధ ప్రాతిపదికన పద్ధతి ప్రకారం అమలు చేస్తే, రాబోయే పది సంవత్సరాల లోపల చాలా వరకూ వ్యవసాయ సంక్షోభాన్ని, తగ్గించి, క్షీణిస్తున్న గ్రామీణ జీవనోపాధులను మరింత దుర్భరం కాకుండా నివారించవచ్చును.

### 2.1 కరువు నివారణకు “అనంతజలవలయం” ద్వారా భూగర్భజలాల అభివృద్ధి, వర్షాధార పంటలకు వరుపులో రక్షణ (కరువు నివారణ)

ఈ జిల్లాలో వర్షాధారం కింద దాదాపు 10 లక్షల హెక్టార్లలో ముఖ్యంగా వేరుశెనగ మరికొన్ని ఇతర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. సాధారణంగా జులై, ఆగస్టు మాసాల్లో వేరుశెనగ ఊడలు దిగే సందర్భాలలో ఒక్కొసారి 40 నుంచి 45 రోజుల వరకూ వర్షాలు రాకపోవడం(వరుపు) చేత వేరుశెనగ పంట కరువుకు బలై పోతున్నది. ఇటువంటి సందర్భాలలో వర్షాధార పంటలకు ఒకటి లేదా రెండు రక్షక తడులు ఇవ్వగలిగితే పంట కరువులను చాలావరకు నివారించుకోవచ్చును. అనంతపురం జిల్లా నీటి కరువులు అధిగమించడానికి పూర్వీకులు వర్షపు నీటి నిలువ కోసం వేల కొద్దీ చెరువులు, కుంటలు, తలిపిర్లు, సప్లయ్ ఛానల్స్, స్ప్రింగ్ ఛానల్స్ నిర్మించారు. వాటికట్టలు, మొరవలు తెగి, మరమత్తులు లేక పూడిక చేరి, వాటి సమార్థాన్ని కోల్పోతున్నాయి. నీటి నిలువ కోసం ఈ చిన్న నీటి వనరులన్నింటినీ పునరుద్ధరించాలి. వర్షపు నీరు, భూగర్భజలాలు, నదీ జలాల అనుసంధానంతో (conjunctive use of water) “అనంత జలవలయం” (Anantapuram Water Grid) ఏర్పాటు చేయవలయును. “అనంత జలవలయం” ద్వారా వర్షాధార పంటలకు రక్షక తడులు ఇవ్వవలయును, “అనంత జలవలయం” ఏర్పాటు చేయడానికి అనుసంధాన నీటి వినియోగం తీసుకొని రావడానికి క్రింది చర్యలు చేపట్టవలసి వుంటుంది.

1) సాంప్రదాయక నీటి వనరులైన చెరువులను కుంటలను పూర్తి సామర్థ్యం స్థాయికి పునరద్ధరించడం
2) నీటి పారుదల చెర్వులన్నింటిని ఊట చెరువులుగానూ, నీటి నిలువ చెరువులుగానూ మార్చడం.
3) స్థానికంగా నీటి లభ్యతకు అదనంగా తుంగభద్ర హంద్రీనీవా నదీ జలాలతో సాంప్రదాయ నీటి చెరువులను నింపే వ్యవస్థను ఏర్పాటు చేయడం. దీనినే "అనంత జలవలయం" అని అంటున్నాము.
4) వర్షాధార భూములకు రక్షకతడులు అందించడానికి పైపుల ద్వారా లేదా మొబైల్ స్ప్రింక్లర్ యూనిట్ల ద్వారా నీటి పంపిణీ వ్యవస్థను నెలకొల్పడం.
5) ఈ నీటి పంపిణీ వ్యవస్థ ద్వారా వర్షాధార భూములకు వరుపు కాలంలో మొబైల్ స్ప్రింక్లర్ల యూనిట్ల ద్వారా (15 మి. మీ?) రక్షక తడులు ఇవ్వడానికి ఏర్పాట్లు చేయడం.
6) దీని ద్వారా జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి, భూగర్భ జలాల నుండి కూడా వర్షాధార పంటలకు రక్షక తడులు ఇవ్వడం సాధ్యమవుతుంది.
7) పండ్ల తోటలకు కూడా అవసరమైన సందర్భాలలో రక్షక తడులు ఇచ్చి వాటిని కాపాడవచ్చును.

ఈ రక్షక తడుల పద్ధతి ద్వారా పంట కరువులను నివారించి, లక్షలాది నిరుపేద వర్షాధార రైతులకు శాశ్వతంగా ఉపశమనం కల్గించవచ్చును. ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న "అనంత జలవలయం" ద్వారా జిల్లాలో ప్రాంతాల మధ్య నీటి పంపిణీలో సమతుల్యత అభివృద్ధి చెందుతుంది. జిల్లాలో అన్ని ప్రాంతాలకు కొంతవరకు నీటి వసతి సమకూరుతుంది. అంతేగాకుండా బోరుబావులు లేని, అధికంగా యస్.సి., యస్.టి, బిసి ఇతర చిన్న, సన్నకారు రైతులు లబ్ధి పొందుట ద్వారా సాంఘిక సమతుల్యత కూడా సాధించవచ్చును.

**2.2 సాగుభూమిలో 33 శాతం వర్షాధార పండ్లతోటలు** (Rainfed horticulture)**లు మరియు ఇతర వృక్ష పంటలను** (Agro-forestry) **పెంపొందించాలి. వృక్ష పంటలు కరువుకు తట్టుకొనగలవు మరియు పర్యావరణం అభివృద్ధి చెంది, ఎడారీకరణ ఆగిపోతుంది.**

ఈ జిల్లాలోని నేలలు, వాతావరణం పళ్ళ తోటలకు చాలా అనుకూలమైనది. యుద్ధప్రాతిపదికన వర్షాధార పళ్ళతోటలు, ఇతర ఫలవృక్షాలను జిల్లా సాగు భూమిలో 33 శాతం అంటే దాదాపు 4 లక్షల హెక్టార్లలో అభివృద్ధి చేయాల్సి వున్నది. దీని ద్వారా జిల్లాలో తక్కువగావున్న అటవీ వృక్ష సంపద లేని కొరతను పూరించి చేసినట్లుగా కూడా వుంటుంది. వర్షాధారం క్రింద కూడా చింత, మామిడి, సపోటా, ఉసిరిక, సీతాఫలం, నేరేడు, సీమ చింత లాంటి పండ్ల మొక్కలను పెంచవచ్చునని 20 సంవత్సరాల నుంచి ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటరు విజయవంతంగా నిరూపించింది. ఈ పథకం విజయవంతం కావడంతో ప్రభుత్వం కూడా డి.డబ్ల్యూ.యం.ఎ ద్వారా రైతులకు ఈ కార్యక్రమాన్ని అమలు పర్చుతున్నది. అంతేగాక, మేతకోసం, పచ్చి రెట్ట కోసం, ఔషధముల కోసం, కలప కోసం ఇతర అనువైన వృక్ష పంటలను కూడా విస్తృతంగా చేపట్టుటకు అవకాశాలు ఉన్నాయి. దీని ద్వారా నిరుపేద రైతులకు నమ్మకమైన ఆదాయ వనరులు, జీవనోపాధులు ఏర్పడడమే కాకుండా జిల్లాలో శాశ్వత పచ్చదనం ఏర్పడుతుంది. పర్యావరణం అభివృద్ధి చెందుతుంది. తద్వారా ఎడారీకరణ నివారణకు తోడ్పడుతుంది. మొక్కల మెరుగుదల కోసం, నేల, నీరు సంరక్షణ కార్యక్రమాల్ని అభివృద్ధి పర్చాల్సిన అవసరమున్నది. మొక్కలు నాటినప్పటి నుండీ వాటిని సంరక్షించుకుంటూ ఫలసాయం పొందే స్థాయి వరకూ రైతులకు 3 నుండి 5 సంవత్సరములు తగిన విధంగా, నమ్మకంగా ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు ఇవ్వవలసియున్నది. వృక్ష పంటలు ఫలదీకరణ చెందడానికి దాదాపు 3 నుంచీ 5 సంవత్సరాల సమయం పడుతుంది కాబట్టి, రైతులకు ఇచ్చే ప్రోత్సాహకాలు వారిని ఉత్తేజపరిచేవిగా వుండాలి.

**2.3 అటవీకరణ మరియు ఉమ్మడి భూముల అభివృది ద్వారా వృక్ష సంపదను మేత లభ్యతను పెంపొందించుటః పచ్చదనం పర్యావరణ వనరలను పెంపొందించి ఎడారీకరణను నివారించుట.**

అనంతపురం జిల్లాలో దాదాపు 2 లక్షల హెక్టార్ల అటవీ భూమి వృక్ష సంపద లేకుండా దాదాపు బీడుగా వుంది. అదనంగా మరి యొక 2 లక్షల హెక్టార్ల రెవిన్యూ భూమి, గుట్టలు, వంకలు, చెరువులు కూడా వృక్ష సంపద లేకుండా బీడు భూములుగా ఉన్నాయి. ఈ 4 లక్షల హెక్టార్లు ఉమ్మడి వనరులుగా (Common Property Resource) పేద రైతులకు, వ్యవసాయకూలీలకు ఉపాధి వనరులుగానే కాక జిల్లా ఎడారిగా మారకుండా పచ్చదనం అభివృద్ధి చేయాలి. జిల్లాలో వ్యవసాయం తరువాత అధికంగా ఆధార పడుతున్నది గొర్రెలు, మేకల పెంపకం, మరియు పాడి పరిశ్రమ. జిల్లాలో చిన్న జీవాలు మేత, నీళ్ళు దొరకక నూర్ల కిలోమీటర్లు దూర ప్రాంతాలకు వలసపోతూ, గొర్రెల పెంపకందార్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పశువులమేత లేమితో రైతులు పశువులను అతి తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. గొర్రెల పెంపకం, పాడిపశువుల పెంపకానికి అవసరమైన మేత లభ్యతను విస్తృతంగా పెంచడానికి 2 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతములోనూ, మరియు 2 లక్ష ల హెక్టార్ల రెవిన్యూ పరిధిలోని బీడు భూములు, బోడి కొండలలోను గడ్డి మొక్కలను, పళ్ళ చెట్లునూ, మేత చెట్లను, మేతకు మరియు సేంద్రీయ పదార్థ (Biomass) ఉత్పత్తికి పనికొచ్చే వృక్ష పంటలను వృద్ధి చేయువలయును. అటవీ ప్రాంతంలో వున్న చెరువులను, కుంటలను కూడా పునరుద్ధరించాలి. అవసరమైన భూసారసంరక్షణ వర్షపు నీటి రక్షణ కార్యక్రమాల్ని చేపట్టాలి. ఈ భూములన్నింటిలోనూ సీతాఫలం, నేరేడు, సీమచింత, చింత, నారవ, బలిజ, కల్లీ లాంటి అడవి (wild fruit trees) పండ్ల చెట్లు, పశువుల మేతకు పనికి వచ్చే తుమ్మ, వేప, చింత, రావి, మర్రి లాంటి చెట్లు నాటించి పచ్చదనం అభివృద్ధి చేయాలి. పరిమిత హక్కులతో గొర్రెలు, పశువుల్ని మేపుకోవడానికి లేదా గడ్డికోసుకొనుటకు రైతులకు అనుమతించాలి. ఈ నాలుగు లక్షల హెక్టార్ల భూములలో పచ్చదనం అభివృద్ధి చేస్తే భూగర్భజలాల మట్టం పెరుగుతుంది. పచ్చదనంతో నేల పరిపుష్టి చెంది ఎడారీకరణ నివారణ అవుతుంది.

**2.4 సమగ్ర వ్యవసాయ వ్యవస్థ** (Integrated Farming System) **ద్వారా ప్రతి వ్యవసాయధార రైతు కుటుంబ స్థాయిలో కనీసంగా 100 పళ్ళ చెట్లు, 2 లేక 3 ఆవులు / 10 గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించుట: వృక్ష పంటలు, పశువులు సాంవత్సరిక పంటలకు తోడుపడతాయి.**

పంట కరువులకు గురయ్యే ప్రతి వర్షాధార వ్యవసాయ కుటుంబానికి ఒక సమగ్ర వ్యవసాయ వ్యవస్థ పథకం ద్వారా ప్రోత్సహించాలి. తద్వారా ప్రతి కుంటుంబ స్థాయిలోనూ కార్తె పంటలను, వృక్ష పంటలను, పశుపెంపకాన్ని అనుసంధానం చేసి, ఒకదానికొకటి తోడుపడేవిధంగా ఒకటి విఫలమైనా మిగిలినవి ఆదుకొనే విధంగా ఆదాయ భద్రత కల్పించాలి. వ్యవసాయ అనుబంధ కార్యక్రమంగా పాడి పశువులు, గొర్రెలు, మేకలు అభివృద్ధి చెందితే

వర్షాధార రైతులకు కరువుకు తట్టుకునే పరిస్థితులు ఏర్పడతాయి. దారిద్ర్య వలసలు ఆగిపోతాయి. పాడిపశుల అభివృద్ధి కోసం రెండు విధాలుగా కృషి చేయవలసి వుంది. మొదటిది దేశవాళీ రకాలైన పశువులను ప్రోత్సహించాలి. ఈ దేశవాళీ రకాలు ఉమ్మడి వనరులైన కొండ గుట్టల వెంబడి, వంకలు, చెరువుల వెంబడి, తిరిగి ఎండు మేత తిని బతక గలిగే స్థానిక రకాలైన పుంగనూరు, తార్పార్కర్, హలిక్లార్, ఒంగోలు, సింధీలాంటి కరువు ప్రాంతాలకనువైన పాడి ఆవులను మెట్ట రైతులకు సరఫరా చేయాలి. ఈ పశువులు స్వయంగా కొండ గుట్టలలో తిరిగి మేస్తూ అదనంగా వ్యవసాయ వ్యర్థాలను మేతగా తిని జీవించగలవు. వ్యవసాయానికి అవసరమైన సేంద్రీయ ఎరువును కూడా ఇవ్వగలవు. ఉమ్మడి భూములలో కూడా పశువులు తిరగడం ద్వారా వీటి ఉత్పాదకత కూడా పెరుగుతుంది. ఈనాటీ పశువులు వర్షాధార, పేద రైతులకు అనుకూలంగా వుంటాయి. రెండవది అధిక పాల దిగుబడినిచ్చే సున్నితమైన, విదేశీ రకాల పశువులు, జెర్సీ, హైఫరు మొదలగునవి. వీటి పెంపకం అధిక ఖర్చుతోకూడుకొని, సున్నితమైన యాజమాన్య పద్ధతులు పాటించవలయును. పచ్చిగడ్డి తప్పని సరిగా ఉండవలయును. నీటి సాగుగల మధ్య తరగతి, పెద్ద రైతులకు ఈ విధం లాభదాయకంగా వుంటుంది.

**2.5 చిరు ధాన్యాలు, పప్పుదినుసుల** (Millets+Pulses) **మిశ్రమ పంటలను ప్రోత్సహించి, ఆహార భద్రత, పౌష్టికాహార భద్రతను పెంపొంచుట: స్థానిక రకాల ధాన్యాన్ని ఐ.సి.డి.యస్,మధ్యాహ్న భోజన పథకం, ప్రజా పంపిణీ వ్యవస్థల ద్వారా సరఫరా చెయ్యాలి. ఆహార ధాన్యాల సుదూర రవాణాని తగ్గించాలి.**

అనంతపురం జిల్లాలో వేరుశనగ ప్రాధాన్యత పెరగడం చేత ఆహార ధాన్యపు పంటల విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. దీని ఫలితంగా గ్రామీణ ప్రజానీకం కేవలం ప్రజా పంపిణీ బియ్యం మీదనే ఆధారపడడం చేత పౌష్టికాహార వినియోగం తగ్గి, గ్రామీణ ప్రజలలో రోగ నిరోధక శక్తి తగ్గిపోతున్నది. వేరుశనగ పంట విస్తీర్ణాన్ని తగ్గించి చిరుధాన్యపు పంటలు, పప్పుధాన్యపు పంటలను అంతర పంటలను ప్రోత్సాహించాల్సిన అవసరం వున్నది. అనంతపురం జిల్లాకు అనువైన పంటలు జొన్న, సద్ద, కొర్ర, కంది, అలసంద, నువ్వులు, పెసలు మొదలగు పంటలు. ఈ పంటలు పండించడానికి ప్రభుత్వం నుంచి రైతులకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వవలసియున్నది. చిరుధాన్యాలు పండించే రైతుకు పంట భీమాను, రుణ సౌకర్యము, మద్దతు ధరను ముందుగానే ప్రకటించి, ప్రభుత్వమే పంటలను సేకరించవలయును. ఆ విధంగా సేకరించిన ధన్యాన్ని స్థానిక వినియోగం కొరకు ఐ.సి.డి.ఎస్ (ICDS) కార్యక్రమము, మధ్యాహ్న భోజన పథకం, ప్రజా పంపిణీ వ్యవస్థల ద్వారా స్థానికంగా పంపిణీ చేయవచ్చును. దీని ద్వారా నిరుపేదలకు చిన్న పిల్లలకు, విద్యార్థులకు పౌష్టికాహార భద్రత ఏర్పడుతుంది. స్థానిక పంటలను వినియోగంలోకి తేవడం ద్వారా సుదూర ప్రాంతాల నుండి తిండి గిజల రవాణా భారం తగ్గుతుంది. పౌష్టికాహార భద్రత పెరుగుతుంది.

**2.6 అధిక వ్యయ హరితవప్లవ వ్యవసాయం నుండి తక్కువ వ్యయపు సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించుట:**

హరత విప్లవ ఆధారమైన అధిక వ్యయ విధ్వంస వ్యవసాయం (High External Input Destructive Agriculture, HEIDA) అనంతపురం కరువు వ్యవసాయ వాతావరణానికి ఏ మాత్రం సరిపోదు. ముఖ్యంగా వర్షాధార రైతులు మరియు చిన్న-సన్నకారు రైతులు హరిత విప్లవ వ్యవసాయ పద్ధతుల వలన చాలా నష్టపోతున్నారు. అధికంగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల వ్యవసాయ పెట్టుబడులు పెరగడంతోపాటు పంటలు, నేల, నీరు వాతావరణం కలుషితమవుతున్నది. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ముఖ్యంగా వర్షాధార రైతులు చిన్న రైతులు వ్యవసాయం నుండి గెంటివేయబడుతున్నారు. వారు అధిక పెట్టుబడులను భరించలేకున్నారు. అధిక పెట్టుబడుల రసాయనిక వ్యవసాయం వల్ల ప్రజల ఆరోగ్యాలు పాడవడమే కాకుండా పర్యావరణం, వాతావరణం కూడా దెబ్బతింటున్నది. అధికంగా రసాయనిక ఎరువుల వాడకం మూలంగా భూమి ఉత్పాదకత కూడా దెబ్బతింటున్నది. కాబట్టి అధిక పెట్టుబడుల రసాయనిక వ్యవసాయం స్థానంలో తక్కువ పెట్టుబడుల సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సాహించాలి. అధిక పెట్టుబడుల రసాయనిక వ్యవసాయానికి ప్రభుత్వం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ హెక్టారుకు 10,000/- వరకూ రసాయనిక ఎరువుల రూపంలో, యంత్రాల రూపంలో, ఉచిత కరెంటు రూపంలో రాయితీ సమకూరుస్తున్నది. కాబట్టి ప్రభుత్వం అధిక పెట్టుబడుల రసాయన వ్యవసాయం నుండి తక్కువ పెట్టుబడుల రసాయన రహిత సుస్థిర వ్యవసాయ పద్ధతులు ఆచరించే రైతులందరికీ హెక్టారుకు కనీసంగా ₹7500/- వంతున ప్రోత్సహకాలు ఇవ్వాలి. అప్పుడు రైతులు సుస్థిర వ్యవవసాయం, వైపు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతారు. వారికి కావలసిన ఎరువుల్ని వారే తయారు చేసుకుంటారు. జీవ పంట రక్షణ పద్ధతుల్ని అవలంబిస్తారు.

**2.7 వ్యవసాయోత్పత్తుల ప్రోసెసింగ్, పంటలకు అదనపు విలువలు, గిట్టుబాటు ధరలు.**

జిల్లాలో పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు శ్రేష్టతకు, నాణ్యతకు ప్రసిద్ధి. చాలా మంది రైతులు టొమెటా, బొప్పాయి, చీనా, దానిమ్మ, సపోటా, జామ, కళింగర, ద్రాక్ష, మామిడి లాంటి పంటలతో పాటు వేరు శెనగ, శనగ, జొన్న, కందులు లాంటి పంటలను పండిస్తున్నారు. వీటికి సరైన మార్కెటింగ్ విలువ సదుపాయాలు లేక రైతులు విపరీతంగా నష్టపోతున్నారు. ప్రతి మండలంలోనూ శీతల గిడ్డంగులు నిర్మించాలి. కనీసంగా మొదటి దశ ప్రొసెసింగ్ యూనిట్లను నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ వుత్పత్తులకు నమ్మకమైన మార్కెటింగ్ సదూపాయం, సేకరణ సదుపాయం కల్పించాలి. వివిధరకాలైన పండ్ల ఉత్పత్తులైన పండ్ల రసం పరిశ్రమలు, టమాట కెచప్ లాంటి పరిశ్రమలు స్థాపించడం ద్వార వాటి ధరలను స్థిరీకరించడంతో పాటు గిట్టుబాటు ధరలు కూడా లభిస్థాయి.

**2.8 పారిశ్రామీకరణ - జిల్లాకు అత్యవసరము, అనివార్యము**

అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేవలం వ్యవసాయంలో వెనుకబడినదేకాదు. పారిశ్రామికంగా కూడా పూర్తిగా వెనుకబడింది. దాదాపు 40 లక్షలకుపైబడిన జనాభావున్న జిల్లా కేవలం 20 వేల మంది మాత్రమే కార్మికులున్నారు. అనంతపురం జిల్లా విద్యావసతులలోనూ, మానవ వనరులలోనూ ముందున్న జిల్లా. అనంతపురం జిల్లా సరిహద్దు నుండి బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం 75 కి. మీ. దూరంలో మాత్రమే వుంది. దేశంలోనే పొడవైన కన్యాకుమారి - శ్రీనగర్ జాతీయ రహదారి ఈ జిల్లా మధ్య భాగం గుండా పోతున్నది. హైదరాబాదు- బెంగుళూరు మధ్యలో జాతీయ

రహదారితో కలిసి వుండడం వల్ల ఈ జిల్లా కీలక స్థానంలో ఉండి పారిశ్రామికంగా బెంగుళూరు- హైదరాబాదు పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చెందుటకు అనుకూలంగా ఉంది. ఈ జిల్లా వ్యవసాయ భూములు చాలా తక్కువ ఉత్పాదనా సామర్థ్యం కలిగి అను నిత్యము కరువులకు గురవుతూ ఎడారిగా వేగంగా మారిపోతున్నది. బహుశా దేశంలోనే అనంతపురం జిల్లా రైతులు మాత్రమే కావచ్చు, తమ భూములను పరిశ్రమలకు ఇతర జిల్లాలతో పోలిస్తే అతి తక్కువ ధరలకు ఇవ్వడానికి వారంతట వారే సిద్ధపడుతున్నారు. రైతులే పారిశ్రామికీకరణను సాదంగా ఆహ్వానిస్తున్నారు. తమ పిల్లలకు వ్యవసాయంలో భవిష్యత్తు లేదని భావించి పరిశ్రమలలోస్తేనైనా వారి జీవితాలు బాగుపడగలవని వారి ఆశ.

అయితే పారిశ్రామీకరణకు అవసరమయ్యే నీటి కొరత ఈ జిల్లాలో పారిశ్రామికీకరణకు తీవ్ర అవరోధంగా వుంది. కాబట్టి అత్యంత ప్రాధాన్యత నిచ్చి, వెంటనే పరిశ్రమల కోసం 5 టి.యం.సిల నమ్మతగిన నదీజలాలు ఈ జిల్లాకు కెటాయించాల్సి వుంది. నీటి వసతి గనుక వుంటే పారిశ్రామికీకరణ వేగంగా చెప్పుకోదగ్గ స్థాయిలో పుంజుకోగలదు. జిల్లా వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యల కారణంగా, జిల్లా అభివృద్ధి కొరకు చిన్న, పెద్ద, మధ్య తరహా లాంటి అన్ని స్థాయి పరిశ్రమలను ప్రోత్సాహించాల్సిన అవసరం వుంది. అనంతపురం జిల్లాలో పారిశ్రామికీకరను ప్రోత్సహించడానికి ఇది అనివార్యాము, న్యాయము, అత్యవసరము కూడా.

### 2.9 రైతులతో సహా గ్రామీణ పేదలందరికీ ఆరోగ్యభద్రత మరియు విద్యాసౌకర్యాలు

రైతులు, గ్రామీణ పేదలు రుణభారంలో మునిగిపోవడానికి వ్యవసాయ సంక్షోభంతోపాటు దిన దినానికి పెరుగుతున్న ఆరోగ్య ఖర్చులు భరించలేకపోవడమే. కాబట్టి అనంతపురం జిల్లాలోని గ్రామీణులందరికీ ఆరోగ్యభద్రత కల్పిస్తే గ్రామీణ దుర్భిక్షం గణనీయంగా తగ్గుతుంది. ప్రభుత్వ వైద్య సదుపాయాలను మెరుగుపరచి, అందరికీ అందుబాటులోకి తేవలయును మరియు ఉన్నత వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ ని విస్తృత పరచి, అన్ని రోగాలు కలుపుతూ సవరించి అమలు చేయవలయును.

రైతులు, గ్రామీణ పేదలు ఋణభారంలో మునిగి పోవడానికి ఇంకొక ముఖ్య కారణం దినదినానికి పెరుగుతున్న అధిక ఖర్చుతో కూడుకొన్న అధిక ఖర్చుతో కూడుకొన్న చదువులను “కొనలేక” పోవడమే. వ్యవసాయం సంక్షోభంలో మునిగి, గ్రామాలలో వ్యవసాయంలో భవిష్యత్తు కానరాక, పిల్లలను పైచదువులు చదివించాలనే తపనతో, విద్యాఖర్చులకోసం ఋణగ్రస్థులైపోతున్నారు. కాబట్టి, గ్రామీణ కుటుంబాలకందరికీ నాణ్యమైన చదువులందే విధంగా ప్రభుత్వ విద్యాలయాల ప్రమాణాలు బాగా పెరగాలి. పై చదువుల కోసం, ఫీజు చెల్లింపులు, వసతి గృహాలు లాంటి తగిన రాయితీలు సదుపాయాలు కల్పించవలయును. ముఖ్యంగా గ్రామీణ, మండల ప్రభుత్వ విద్యాలయాలలో విద్యా నాణ్యతాప్రమాణాల్ని పెంచవలసియున్నది. ప్రైవేటు విద్యా సంస్థలలో కూడా నాణ్యతాప్రమాణాలు పెంచే విధంగా మరియు ఫీజుల నియంతించే చర్యలు చేపట్టవలసియున్నది:

### 2.10. అనంతపురం జిల్లా అభివృద్ధికి అయిదు సంవత్సరాల సమగ్ర అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక

వ్యవసాయంలో సంక్షోభ నివారణ అతి ముఖ్యమయిన కార్యక్రమమే కానీ, దీర్ఘకాలిక కవల సమస్యలైన కరువు-దారిద్ర్యం కేవలం వ్యవసాయంతో పరిష్కారం కావు. జడలు వేసుకుని పెనవేసుకున్న కరువు-దారిద్ర్యం - ఎడారీకరణ సమస్యలను పరిష్కరించడానికి విడి విడిగా, పాక్షికంగా చేసే అభివృద్ధి కార్యక్రమాల అమలు అనంతపురం జిల్లాలో ఎడారీకరణను, పేదరికాన్ని నిర్మూలించ లేవు. వివిధ రంగాల అభివృద్ధి కార్యక్రమాలను సమీకరించి సమన్వయం చేసి అమలు పర్చాల్సి వుంటుంది. జిల్లా సర్వతోముఖాభివృద్ధి కోసం ఒక అయిదు సంవత్సారాల కాల వ్యవధి గల సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడంలో చిన్న, పెద్ద, సూక్ష్మ స్థాయి పరిశ్రమల స్థాపించుటకు తగిన ప్రోత్సాహకాలు, ఉండాలి. యువతకు వ్యవసాయేతర రంగాలలో ఉపాధి నైపుణ్యాలను పెంపొందించే ప్రణాళిక ఉండాలి. మహిళలకు, వ్యవసాయ కూలీలకు అదనపు జీవనోపాధులు, ఆదాయ అవకాశాలు కల్పించాలి. ఈ సమగ్ర ప్రణాళికలోని కార్యక్రమాలన్నింటికి నిధుల కొరత లేకుండా చాలినన్ని నిధులు జిల్లా యంత్రాంగం ఆధీనంలో వుంచాలి. ఎన్నికైన ప్రజాప్రతినిదులు, పంచాయితీరాజ్ ప్రజాప్రతి నిధులు, ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ పార్టీలు, ప్రజా వేదికలు కలిసి అభివృద్ధి కార్యక్రమాల్ని అమలు చేయడంలో విజయవంతం చేయాల్సి వుంటుంది. ఈ కార్యక్రమాల్ని గురుతర భాద్యతతో, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరముంది.

## 3. ముగింపు:

పై కార్యక్రమాలన్నిటిని చిత్తశుద్ధితో ఒక కాల వ్యవధిలో పూర్తి చేయడం ద్వారా అనంతపురం జిల్లాలో కరువు, పేదరికం, ఎడారీకరణ అనే సమస్యలను చాలా వరకు అధిగమించగలం వెంటనే కార్యాచరణకు దిగకపోతే పరిస్థితి చేజారిపోతుంది.

మన కార్యచరణ ఇంకేమాత్రం ఆలస్యం కారాదు. బతుకు భారంతో గ్రామీణులందరూ నిరాశా, నిస్పృహలతో పట్టణాలకోసం అదృశ్యం కాకముందే, రైతు స్థాయి నుండి సాధారణ కూలీ స్థాయికి సామాజిక తిరోగమన ప్రయాణం కొనసాగకముందే మేల్కోవాలి. గ్రామీణ ప్రజలకు జీవనంపై ఆశను కల్పించి, వ్యవసాయక, పారిశ్రామికాభివృద్ధిలో మరియు ఎడారీకరణను నివారించడంలో నిర్మాణాత్మకంగా భాగస్వాముల్యను చేయవలసి వుంది.

Brot für die Welt

icco COOPERATION